క్లుప్తంగా

అకడమిక్ ఎఫైర్స్ నూతన డీన్‌గా ఆచార్య లింగరాజు

పెదకాకాని: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అకడమిక్ ఎఫైర్స్ నూతన డీన్‌గా ఆచార్య సిహెచ్ లింగరాజు నియమితులయ్యారని తాత్కాలిక రిజిస్ట్రార్ ఆచార్య జి సింహాచలం గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆచార్య లింగరాజు డీన్ పదవిలో రెండేళ్ల పాటు కొనసాగుతారని ప్రకటించారు. విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాలలోని భౌతికశాస్త్రం ఆచార్యునిగాను, విభాగాధిపతిగాను, విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల తాత్కాలిక ప్రిన్సిపాల్‌గా ఆచార్య లింగరాజు సేవలందిస్తున్నారు. విశ్వవిద్యాలయం తాత్కాలిక ఉపకులపతి ఆచార్య గంగాధరరావు, రెక్టార్ ఆచార్య రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలంతో పాటు పలువురు అధికారులు, అధ్యాపకులు, అధ్యాపకేతర ఉద్యోగులు నూతన డీన్ ఆచార్య లింగరాజును అభినందించారు.

చిన్నారుల ఆరోగ్యం తల్లిపాలతోనే సాధ్యం



గుంటూరు రూరల్: చిన్నారుల ఆరోగ్యం తల్లిపాలతోనే సాధ్యమని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ విద్యాధర్ తెలిపారు. గురువారం కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో చౌడవరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల వద్ద అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రతి చిన్నారికి తల్లిపాలను తప్పకుండా పట్టించాలని తల్లిపాలు చిన్నారుల జీవితాలకు ఆరోగ్యపోషకాలని తెలిపారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి తల్లులకు, గర్భిణులకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. అప్పుడే పుట్టిన ప్రతి చిన్నారికి గంటలోగా తల్లిపాలను పట్టించాలని తెలిపారు. మూఢ నమ్మకాలను విడనాడాలని తెలిపారు. కార్యక్రమంలో తల్లులకు, గర్భిణులకు పౌష్టికాహారం టానిక్, పాలు, ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్, ఆయాలు గ్రామంలోని పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో శారీరక, మానసిక వికాసం

ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో జి. విజయలక్ష్మి

ప్రత్తిపాడు: తల్లిపాలు బిడ్డకు తాగించడం ద్వారా శిశువుల్లో శారీరక, మానసిక వికాసం లభిస్తుందని ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో జి. విజయలక్ష్మి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పెదనందిపాడు బిసి-3 అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పోషకాహార ప్రదర్శన ఏర్పాటు చేశారు. హాజరైన సీడీపీవో విజయలక్ష్మి బిడ్డ పుట్టినప్పటి నుండి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం వలన బిడ్డ ఆరోగ్యవంతంగా ఎదుగుతారని చెప్పారు. తల్లిపాలతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. పిల్లలు తక్కువగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్యను పెంచేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అంగన్‌వాడీ లక్ష్యాన్ని తల్లిదండ్రులకు వివరించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ సీడీపీవో సీహెచ్. విజయనిర్మల, సెక్టార్ సూపర్‌వైజర్ షేక్ మెహరున్నీసా బేగం, మహిళా పోలీస్ భార్గవి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

పట్టాభిపురం ఎస్ఐగా నాగేంద్ర బాధ్యతల స్వీకరణ

లక్ష్మీపురం: పట్టాభిపురం ఎస్ఐగా ఐ.నాగేంద్ర గురువారం బాధ్యతల స్వీకరించారు. ఇప్పటి వరకు పని చేసిన ఎస్ఐ నరహరిని అధికారులు ప్రత్తిపాడు స్టేషన్‌కు పంపారు. ఆయన స్థానంలో ప్రత్తిపాడు ఎస్ఐగా పని చేస్తున్న నాగేంద్రను పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. గురువారం సాయంత్రం నాగేంద్ర స్టేషన్ సీఐ గంగా వెంకటేశ్వర్లును కలిసి బాధ్యతలు స్వీకరించారు. 2018లో ఎస్ఐగా చేరిన నాగేంద్ర లాలాపేట, పెదకాకాని, ప్రత్తిపాడు స్టేషన్‌లలో పని చేశారు.

ఘనంగా వివా ఇన్వేష్చర్ వేడుక



పెదకాకాని: వివా స్కూల్‌లో విద్యార్థుల్లో నాయకత్వ నైపుణ్యాలు, బాధ్యతా భావాన్ని పెంపొందించేందుకు విద్యార్థి నాయకులను గుర్తించి అధికారికంగా బాధ్యతలు అందించే కార్యక్రమం (ఇన్వేష్చర్) గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇన్స్‌పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, ఆంధ్రప్రదేశ్ ఏసీబీ డైరెక్టర్ ఆర్.జయలక్ష్మి హాజరయ్యారు. వివా చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్‌తో కలసి క్రీడలు సాంస్కృతిక నాయకులు, పాఠశాల హెడ్ బాయ్, హెడ్ గర్ల్‌ను నియమించారు. అలానే జట్టు స్ఫూర్తిని పెంపొందించేలా పాఠశాలలో ఏర్పాటు చేసిన హానెస్టీ, కంప్యాషన్, కరేజ్, ట్రూత్, లాయల్టీ హౌస్ లకు కెప్టెన్, వైస్ కెప్టెన్, ప్రిఫెక్ట్స్ లకు బ్యాడ్జీలను ప్రదానం చేశారు.

కూటమి పాలనలో అన్ని వర్గాలకు అన్యాయం

- వైఎస్సార్‌సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీ కృష్ణ
- ఇటికంపాడు, నండూరు, వల్లభరావు పాలెం, కసుకర్రు గ్రామాల్లో బాబు ష్యూరిటీ మోసం- గ్యారెంటీ కార్యక్రమం



క్యూఆర్‌కోడ్ పోస్టరును ఆవిష్కరించిన మురళీకృష్ణ, నాయకులు

పొన్నూరు: కూటమి పాలనలో అన్ని వర్గాలకు అన్యాయం జరిగిందని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ తో పాటు అనేక హామీలు ప్రకటించి వాటిని అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు. గురువారం పొన్నూరు మండలంలోని ఇటికంపాడు, నండూరు, వల్లభరావు పాలెం, కసుకర్రు గ్రామాల్లో బాబు షూరిటీ మోసం - గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంబటి మురళీకృష్ణ తో పాటు నాయకులు పాల్గొని ఇంటింటికి వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వివరించారు. గ్రామ ప్రధాన సెంటర్లలో ఏర్పాటు చేసిన వేదికలలో కూర్చుని మహిళలకు జరిగిన అన్యాయాన్ని తెలుసుకున్నారు.

జగనన్న హయాంలో ఇంటింటికీ పథకాలు

గత ప్రభుత్వం హయాంలో సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరాయని మహిళలు తెలిపారు. ఈ ప్రభుత్వంలో త్వరలో పథకాలు అందిస్తామని అనడమే తప్ప అమలు చేసిన దాఖలాలు కనిపించడం లేదని మహిళలు వాపోయారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ అబద్ధపు హామీలతో మోసం చేసిన కూటమి నాయకులను నిలదీయాలని తెలిపారు. అనంతరం ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ ను ఆవిష్కరించి కరపత్రాలను పంపిణీ చేశారు.

కార్యక్రమంలో ఎంపీపీ పద్మ లీలా రెడ్డి, సర్పంచ్ ఆకిశెట్టి గాంధీ, మండల పార్టీ అధ్యక్షులు చింతలపూడి మురళీకృష్ణ, మండల బూత్ కమిటీ అధ్యక్షుడు అమిరినేని రామారావు, నియోజకవర్గ పెన్షనర్స్ అండ్ ఎంప్లాయిస్ విభాగం అధ్యక్షులు చిర్రా అక్కిరెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఆకుల వెంకటేశ్వరరావు, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు చుండూరు వీరయ్య, మండలం మహిళా విభాగం అధ్యక్షురాలు మరియా రాణి, మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు మౌలాలి, ఆరెమండ సర్పంచ్ అప్పారావు, ప్రచార విభాగం అధ్యక్షుడు తురిమెళ్ళ రాజశేఖర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు పందిటి బాజీ, సీనియర్ నాయకులు అమిరినేని సాంబశివరావు, రుద్రపాటి ఆదిశేషు, అంబటి వెంకటేశ్వరరావు, గనిపిశెట్టి వెంకటేశ్వరరావు, కట్టెంపూడి శివనాగులు, సుశోభిత, ఎస్ ఈశ్వరయ్య, మోహన్ రావు పాల్గొన్నారు.

బిడ్డకు అమ్మపాలు అమృతం



వంగిపురం అంగన్‌వాడీ కేంద్రంలో కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం



ప్రత్తిపాడు రామానగర్ కాలనీలో మహిళలు, తల్లులకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

ప్రత్తిపాడు సెక్టార్ సూపర్‌వైజర్ భారతి

ప్రత్తిపాడు: అమ్మపాలను అమృతంతో సమానమని పుట్టిన ప్రతి శిశువుకు గంటలోపే ముర్రుపాలు తాగించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి అన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా గురువారం గొట్టిపాడు సెక్టార్‌లోని వంగిపురం అంగన్‌వాడీ సెంటరులో ఆరోగ్యకరమైన పిల్లల ప్రదర్శనను నిర్వహించారు. ప్రత్తిపాడు సెక్టార్ పరిధిలోని రామానగర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో తల్లిపాలు ఇవ్వడం వలన కలిగే ప్రయోజనాలు, ఇవ్వకపోవడం వలన కలిగే నష్టాలపై మహిళలు, గర్భవతులు, బాలింతలకు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ వి.భారతి మాట్లాడుతూ పాశ్చాత్య సంస్కృతి ప్రభావంతో కొందరు తల్లులు అపోహలకు పోయి బిడ్డలను డబ్బాపాలకు పరిమితం చేస్తున్నారని చెప్పారు. తల్లిపాలు తాగడం ద్వారా శిశువుకు సహజమైన రోగనిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు. తల్లి బిడ్డకు పాలు ఇవ్వడం వలన తల్లికి కూడా పలు ప్రయోజనాలున్నాయని, తల్లికి బ్రెస్ట్ క్యాన్సర్, అండాశయ క్యాన్సర్, రక్తహీనత, ఎముకల బలహీనత వంటి జబ్బుల నుంచి రక్షణపొందే అవకాశాలుంటాయని తెలిపారు.

టీడీపీ గూండాల దాడి హేయమైన చర్య

ఖండించిన ప్రత్తిపాడు నియోజకవర్గ విభాగం అధ్యక్షుడు దారం అశోక్‌కుమార్



మాట్లాడుతున్న దారం అశోక్‌కుమార్

గుంటూరు రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బలహీన వర్గాలపై దాడులు ఎక్కువగా జరుగుతున్నాయని ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ బీసీ విభాగం అధ్యక్షుడు దారం అశోక్‌కుమార్ మండిపడ్డారు. గురువారం బొంతపాడులోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ఓటమి భయంతో కూటమి నేతలు తమ గూండాలతో దాడికి పాల్పడుతున్నారన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఒక బీసీ ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై కావాలని కూటమి నేతలు దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడ్డారన్నారు. దాడి చేసిన వారిని శిక్షించే వరకు బీసీ విభాగం తరుపున పోరాటం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తుందని ఆరోపించారు. రాజకీయాలు ఎల్లవేళలా ఒకేలా ఉండవని కూటమి నేతలు గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా బీసీ విభాగం కార్యదర్శి గుండు నాగరాజు, పత్తిపాడు మండల కన్వీనర్ చల్ల హనుమంతు యాదవ్, కుర్నూతుల సర్పంచ్ ఎర్రాకుల గోపాలకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీపీ మండల్‌కు ఘన నివాళి



బీపీ మండల్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న బీసీ నాయకులు

గుంటూరు రూరల్: వెనుకబడిన వార్గాల ఆరాధ్యుడు బీసీ రిజర్వేషన్ల సాధకుడు, బీహార్ మాజీ ముఖ్యమంత్రి బీపీ మండల్ డేను గురువారం బీసీ నాయకులు అభిమానులు ఘనంగా నిర్వహించారు. అమరావతిరోడ్డులోని చిల్లీస్ సెంటర్ నందున్న బీపీ మండల్ విగ్రహానికి బీపీ మండల్ డే సందర్భంగా పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీఆర్ భగత్‌సింగ్ మాట్లాడుతూ బీపీ మండల్ 40 సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. 40 సిఫారసుల్లో కేవలం ఒక్కటి మాత్రమే అమలు చేశారని ఇది అన్యాయమన్నారు. ఇటీవల బీజేపీ ప్రభుత్వం అగ్రవర్ణాలు అడగకముందే ఓబీసీ కేటగిరిలో వారికి 10 శాతం రిజర్వేషన్‌లు కల్పించారని, ఇది మరింత దుర్మార్గమన్నారు. జనాబా థామాషా ప్రకారం రిజర్వేషన్‌ల సంఖ్య పెంచాలని పెద్దెత్తున డిమాండ్ ఉన్నప్పటికి వాటిని లెక్క చేయకుండా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవటం అన్యాయమన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు రమణప్ప, వాసు, ఉగ్గం సాంబశివరావు, దాసరి శివకుమార్, నరశింహారావు, సాధు సత్యనారాయణ, జూపూడి శ్రీనివాసరావు, విప్పర్ల ముత్తయ్య, రామారావు, జయసుధ, దండా వెంకటేశ్వర్లు, నీలాంబరం, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల తొలగింపు అప్రజాస్వామికం

సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు



మాట్లాడుతున్న పాశం రామారావు

పెదకాకాని: ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణల పేరుతో బీహార్ రాష్ట్రంలో లక్షలాది ఓట్లు తీసివేయడం అనేది అన్యాయం అప్రజాస్వామికమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు అన్నారు. మండల కేంద్రమైన పెదకాకాని సుందరయ్య కాలనీలో గురువారం కేంద్ర ఎన్నికల కమిషన్ చర్యలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేశారు. ఈ సమావేశానికి సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ బీహార్‌లో త్వరలో జరగబోవు శాసనసభ ఎన్నికలను పురస్కరించుకొని ఓటర్ల లిస్టులు మార్పులు చేర్పులు చేయడం సహజమని అయితే ఏకపక్షంగా 67 లక్షల ఓట్లు రద్దు చేయడం అప్రజాస్వామికమని అన్నారు. ప్రజాస్వామ్యంలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ రాజ్యాంగం ఓటు హక్కు కల్పించింది అని ఓటరుగా నమోదు అవ్వడానికి ఆధార్ కార్డు, రేషన్ కార్డుల వంటివి ప్రామాణికంగా తీసుకుంటారని అందుకు భిన్నంగా ఇక్కడ ఎన్నికల కమిషన్ ప్రత్యేక సమగ్ర సవరణల పేరుతో ఇక్కడే జన్మించాను అని అన్న రుజువు చేసే పత్రాలను సమర్పించమనడంతో నిరుపేదలు, కూలీలు, వలస కార్మికులు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఈ దేశంలో పుట్టినట్లు నిరూపించుకునే బంధనాలు రాజ్యాంగ విరుద్ధమన్నారు. దేశవ్యాప్తంగా ఎన్నికల కమిషన్ ఇలాంటి నిబంధనలే తీసుకువచ్చే ప్రమాదం ఉందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇలాంటి అడ్డగోలుగా నిబంధనలు తీసుకువస్తున్నాయన్నారు. కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ రాజ్యాంగ విరుద్ధంగా ఓటర్ల జాబితా సవరణలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.సాంబయ్య, నాగేశ్వరరావు, ఉల్లంగుల శివయ్య, ఆర్.వెంకటేశ్వర్లు, ఎస్కె మస్తానమ్మ, ఎంవెంకాయమ్మ, లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి

గుంటూరు సౌత్ జోన్ డీఎస్పీ జి. భానూదయ

ప్రత్తిపాడు: యువత సైబర్ నేరాల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని గుంటూరు సౌత్ జోన్ డీఎస్పీ జి. భానూదయ అన్నారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడు కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిధిగా హాజరైన డీఎస్పీ జి. భానూదయ మాట్లాడుతూ సిమ్‌ల పేరుతో మనీలాండరింగ్, ఈడీ కేసులో అరెస్టు వారెంట్, డిజిటల్ అరెస్టు, వాట్సాప్, స్కైప్ వీడియోకాల్స్, లాటరీ తగిలిందని.. ఇలా రకరకాలుగా ఫోన్లు చేసి మెసేజ్లు పంపి బ్యాంకు ఖాతాల్లోని నగదును బదిలీ చేయాలని ఒత్తిడి తీసుకువచ్చి నగదును కాజేస్తారని వివరించారు. చట్టబద్ధమైన ఏజెన్సీలు ఏవీ డబ్బులు పంపమని ఒత్తిడి చేయడం జరగదన్నారు. సైబర్ మోసగాళ్ల కాల్స్‌కు స్పందించే ముందు ఒక్క క్షణం ప్రశాంతంగా ఆలోచించి, తెలియని నంబర్ల నుండి వచ్చే ఫోన్లు, వీడియోకాల్స్‌కు వ్యక్తిగత సమాచారం తెలియజేయవద్దన్నారు. ఒక్కోసారి కొందరు చట్టబద్ధమైన సంస్థల లోగోలు పెట్టుకుని మోసాలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఆయా మోసాలపై తల్లిదండ్రులు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ మణిపాల్ రెడ్డి, కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు, కార్యదర్శి కోయి శేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె. చంద్రారెడ్డి, విద్యార్థినీ విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

హరిత విప్లవ సాధనకు స్వామినాథన్ ఎనలేని కృషి

నగరంపాలెం: హరిత విప్లవ సాధనకు స్వామినాథన్ ఎనలేని కృషి చేశారని వక్తలు కొనియాడారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం పద్మావతి కల్యాణ వేదికపై గురువారం భారతరత్న ఎం ఎస్.స్వామినాథ్ శత జయంతి వేడుకలను గుంటూరు జిల్లా సీనియర్ సిటిజన్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ పాలకమండలి నిర్వాహకులు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. సంస్థ అధ్యక్షులు మన్నె సుబ్బారావు ప్రసంగిస్తూ ఎంఎస్. స్వామినాథన్ గ్రీన్ రివల్యూషన్ ప్రణాళికలు, కృషి క్షేత్రం ఆధునికీకరణలో పెద్దపాత్ర పోషించారని తెలిపారు. హరిత విప్లవ సాధనకు ఎనలేని కృషి చేశారని వివరించారు. అనంతరం పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా స్వామినాథన్ విశేషాలను ప్రదర్శించారు.

10న ఎస్‌హెచ్‌ఓలో ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ (ఎస్‌హెచ్‌ఓ) హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వచ్చే నెల 10న (ఆదివారం) న్యూరాలజీ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థల అధ్యక్షులు డాక్టర్ టి .సేవకుమార్, పావులూరి రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు 2/1 బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఓ భవనంలో నిర్వహించే ఈ వైద్య శిబిరంలో ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ పి.నటరాజ పాల్గొంటారని పేర్కొన్నారు.

ఘనంగా పొనుగంటి జన్మదిన వేడుకలు



పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పొనుగంటి చైతన్య జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు వినోద్, రవీంద్ర ఆధ్వర్యంలో గురువారం బ్రాడీపేటలోని శ్రీసాయి దీన జన సేవా సమితి ఆధ్వర్యంలో పుట్టిన రోజు కేక్‌ను కట్ చేశారు. అనంతరం అక్కడి విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ, రోషన్, వెలుగూరి రత్నప్రసాద్, ఓర్సు శ్రీనివాసరావు, సత్యవతి, శంకర్, విద్యార్థి విభాగం నేతలు పాల్గొన్నారు.

పత్తి పొలంలో లింగాకర్షక బుట్టలు

కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కె. వీరయ్యచౌదరి



పంటను పరిశీలిస్తున్న వీరయ్యచౌదరి

ప్రత్తిపాడు: పత్తి పంటలో రైతులు సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలని కేంద్రియ సమగ్ర సస్యరక్షణ కేంద్రం ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కె. వీరయ్యచౌదరి అన్నారు. ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడులో గురువారం పొలం బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. హాజరైన విజయవాడ కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కె. వీరయ్యచౌదరి రైతులు సాగు చేసిన పత్తి పంటను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీరయ్యచౌదరి మాట్లాడుతూ ప్రస్తుతం పత్తి పంట 25-30 రోజుల దశలో ఉందన్నారు. రసం పీల్చే పురుగులైన పేనుబంక, తెల్లదోమలను పత్తి మొక్కలపై గమనించడం జరిగిందన్నారు. అయితే రసం పీల్చే పురుగులు ఆర్థిక నష్టపరిమితి స్థాయి కన్నా తక్కువగా ఉన్నాయని, అందుచేత పురుగు మందులు వినియోగించాల్సిన అవసరం లేదన్నారు. అయితే పత్తి పంట 40-45 రోజుల దశలో ఉన్నప్పుడు ఎకరాకు ఎనిమిది నుంచి పది వరకు లింగాకర్షక బుట్టలు అమర్చుకుని గులాబీ రంగు పురుగుల ఉధృతిని గమనించాలన్నారు. గుంటూరు ఏడీఏ ఎన్.మోహన్‌రావు మాట్లాడుతూ రైతులు ఈక్రాప్ బుకింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. క్రాప్ ఇన్సూరెన్స్, సీసీఆర్సీ కార్డుల ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ఏవో షేక్ సుగుణ బేగం, వీహెచ్ఏ వి.షణ్ముఖ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలి

బీఈఎంఎల్ ఇండిపెండెంట్ డైరెక్టర్ శివ మకుటం



శివ మకుంటను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

ప్రత్తిపాడు: నేటి తరం యువత, విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అలవరుచుకుని, జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని బీఈఎంఎల్ ఇండిపెండెంట్ డైరెక్టర్ శివ మకుటం అన్నారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థుల ఇండక్షన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిధిగా భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్ (బీఈఎంఎల్) ఇండిపెండెంట్ డైరెక్టర్ శివ మకుటం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. భవిష్యత్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేక రకంగాల్లో కీలక భూమిక పోషించనున్నదని తెలిపారు. విద్యార్థినులు తమ కాళ్ళ మీద తాము నిలబడి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. బిజినెస్ ఎంటర్‌ప్రెన్యూర్, సోషల్ యాక్టివిస్టు డాక్టర్ రాఘవ మాట్లాడుతూ యువత వారి శక్తికి తగ్గట్టుగా లక్ష్యాలను నిర్దేశించుకుని, సాధన దిశగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. విద్యా రంగంలో గొప్పగా రాణించాలని తెలిపారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ ప్రొఫెసర్ కిషోర్ బాబు, డైరెక్టర్ డాక్టర్ కె.వెంకటేశ్వర రావు, ప్రిన్సిపల్ డాక్టర్ జెట్టి అప్పారావు, ఎస్‌అండ్‌హెచ్ విభాగాధిపతి డాక్టర్ కృష్ణ చైతన్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

9న ఆర్‌వీఆర్‌జేసీలో గ్రాడ్యుయేషన్ డే

గుంటూరు రూరల్: మండలంలోని చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 9న 10వ గ్రాడ్యుయేషన్‌డే వేడుకలను నిర్వహించనున్నట్లు కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీ మోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేనిలు గురువారం తెలిపారు. కళాశాలలో ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం మాట్లాడుతూ కార్యక్రమంలో అతిథులుగా భారత సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ, ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.మధుమూర్తిలు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో 2021-25వ సంవత్సర 37వ బ్యాచ్ విద్యార్థులలో సివిల్, కెమికల్, కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ సైన్స్, బిజినెస్ సిస్టమ్, కంప్యూటర్ సైన్స్(డేటా సైన్స్), కంప్యూటర్‌సైన్స్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెషిన్ లెర్నింగ్), కంప్యూటర్ సైన్స్ (ఇంటర్నెట్ ఆఫ్ థింకింగ్), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాల్లో డిగ్రీ పూర్తి చేసుకున్న 1023 మంది విద్యార్థులకు ఇంజనీరింగ్ డిగ్రీ పట్టాలను, 153 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్లు పీజీ పట్టాలను పొందనున్నారని తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బంగారు పతకాలను వేడుకల్లో పాల్గొననున్న ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందించనున్నట్లు కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు తదితరులున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాధిక



నేరాలపట్ల అవగాహన కలిగిస్తున్న సైబర్ క్రైం అధికారులు

గుంటూరు రూరల్: సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా, జాగ్రత్తగా, అవగాహన కలిగి ఉండాలని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాధిక తెలిపారు. గురువారం పెదపలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ నిరుల కళాశాలలో యువజన సర్వీసులు శాఖ, స్టెప్, స్వశక్తి గుంటూరు అధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీ, ఈవ్‌టీజింగ్, ఉమెన్ ట్రాఫికింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ నిపుణుల సలహాలను పాటించాలని, భవిష్యత్తులో ఎటువంటి సమస్యలు ఎదురైనా వెంటనే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ సెల్ విభాగం సీఐ నిస్సార్‌బాషా మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సైబర్ సెల్ విభాగం ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తున్నామన్నారు. సైబర్ నేరాలపట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం అందించరాదన్నారు. వ్యక్తిగత సమాచారం ఎలా జాగ్రత్తపరుచుకోవాలి వివరించారు. బాధితులు ఎవరైనా ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. యువజన సర్వీసుల శాఖ మేనేజర్ బీ రాధిక మాట్లాడుతూ మహిళలు వ్యక్తిగత సమాచారం పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలన్నారు. ఏ సమస్యనైనా ధైర్యంగా పరిష్కరించుకుంటూ జీవితంలో విజయపథంలో నడవాలన్నారు. మహిళల అక్రమ రవాణా, మోసపూరిత చర్యలపై ఏవిధంగా జాగ్రత్త వహించాలి తెలిపారు. కార్యక్రమంలో సైబర్ క్రైం డిపార్ట్ మెంట్ రాజ్ కిషోర్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాలలో విజిలెన్స్ తనిఖీలు



తనిఖీలు నిర్వహించిన అధికారులు

పొన్నూరు: పట్టణంలోని వ్యవసాయ విత్తనాల విక్రయ దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. శ్రీనివాస ట్రేడర్స్, ఈనాడు సీడ్స్ దుకాణాలలో విజిలెన్స్, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి పలు లోపాలను గుర్తించారు. ఆంధ్రప్రదేశ్ కు చెందిన ప్రముఖ విత్తన సంస్థ పేరుతో తెలంగాణ నుండి తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఎలాంటి అనుమతులు లేకుండా విత్తనాలు విక్రయిస్తున్నారని ధ్రువీకరించి రూ.1 లక్ష 94 వేల విలువైన వరి విత్తనాలను సీజ్ చేసి యజమానులపై 6ఏ కేసు నమోదు చేశారు. తనిఖీలలో గుంటూరు విజిలెన్స్ వ్యవసాయ అధికారి సి.హెచ్ ఆదినారాయణ, ఇన్స్పెక్టర్లు కె.చంద్రశేఖర్, పి.శివాజీ, స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.